క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరం రేపు

గుడిపాల: తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్ తెలిపారు. నరహరిపేట జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించే ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేయనున్నట్లు వివరించారు. కంటిపొర ఉందని నిర్ధారణ అయితే అదేరోజు తిరుపతి జూపార్క్ రోడ్డులోని అరవింద్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స చేస్తారని చెప్పారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం


ఏకాంబరం

అరుణ్‌కుమార్

ఐరాల: స్థానిక ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎన్నికల పరిశీలకులు యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కే.ప్రభాకర్, అధ్యక్షుడిగా డీ.ఏకాంబరం, ప్రధాన కార్యదర్శిగా కే.అరుణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.లీలావతి, బీ.సురేష్‌బాబు, కోశాధికారిగా జీ.దేవరాజులు, జిల్లా కౌన్సిలర్లుగా హరి, హరిప్రసాద్, మోహన్, సోమశేఖర్‌నాయుడు, యుగంధర్, మండల కార్యదర్శులుగా గుణసుందరి, నాగరాజు, కరుణ, మోహనకుమారి ఎన్నుకున్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ సాయిసుధ

గుడిపాల: గాలికుంటు వ్యాధి సోకకుండా 4 నెలలు వయసు దాటిన పశువులన్నింటికీ వ్యాక్సిన్లు వేయాలని పశువైద్యాధికారి సాయిసుధ సూచించారు. మండలంలోని గుడిపాల పంచాయతీలో పశువులకు వైద్యం తనిఖీచేసి 125 పాడి పశువులకు జడుపు వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేశారు. వారు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో పశువులు బాధపడితే 1962 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని, వెంటనే మొబైల్ వాహనంతో సిబ్బంది వచ్చి పశువులకు ఆరోగ్య తనిఖీలు చేస్తారన్నారు. రైతులంతా డాక్టర్ వైఎస్సార్ సంచార పశుసేవా కేంద్రం సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఆమెతో పాటు సిబ్బంది జ్యోత్స్న, అబ్దుల్లా పాల్గొన్నారు.

పకడ్బందీగా సాగుతున్న ఇంటర్ పరీక్షలు

పూతలపట్టు: ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా సాగుతున్నాయని ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరుగుతున్న పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు గమనించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు. విద్యార్థులకు డీ హైడ్రేషన్ కాకుండా ఉండడానికి తాగునీరు వసతి కల్పించాలని చెప్పారు. శుక్రవారం పరీక్షకు 109 మంది విద్యార్థులకుగాను 103 మంది హాజరైనట్లు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో విద్యార్థులు ఖాళీ కడుపుతో పరీక్షకు రాకుండా అల్పాహారం తీసుకు రావాలని విద్యార్థులకు సూచించారు. పరీక్ష ముగిసిన వెంటనే విద్యార్థులు ఇంటికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అఖండ ధ్యానం

తవణంపల్లె: మండలంలోని సిద్ధంపల్లె సమీపంలో ఉన్న శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ శక్తి క్షేత్రంలో శనివారం నుంచి 24వ తేదీ వరకు అఖండ జ్యోతి, అఖండ ధ్యానం నిర్వహించనున్నట్లు జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ బి.గోపాలక్రిష్ణమూర్తి, కన్వీనర్ రాధిక తెలిపారు. 11 రోజులపాటు ఉచిత అఖండ జ్యోతి, అఖండ ధ్యానం కార్యక్రమంలో పాల్గొంటే సంకల్పం నెరవేరుతుందని వివరించారు. ధ్యానులకు ఉచితంగా భోజనం అందించనున్నట్లు నిర్వాహకులు వివరించారు.

వర్షం పలకరింపు



శ్రీరంగరాజపురం : మండలంలో వేసవితాపం పెరిగిన వేళ, ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు శుక్రవారం పలకరించాయి. పాడి పశువుల రైతులకు అడవి జంతువులకు మేతకు కాస్త ఊపిరి వచ్చింది. ఈ వర్షంతో వేరుశనగ, పశువుల రైతులకు ఊరట లభించింది. అయితే అకాల వర్షం ద్వారా మామిడి రైతులకు మాత్రం నష్టం మిగిలింది. కొన్ని చోట్ల పూత, పిందె రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉండడంతో, చెట్లకింద ఎవరూ ఉండకుండా ప్రజలందరూ జాగ్రత్తగా ఇళ్లలోనే ఉండాలని తహసీల్దార్ షబ్బీర్ బాషా శుక్రవారం సూచించారు.

పదో తరగతి పాసైతే విద్యార్థి జీవితంలో తొలి మెట్టు ఎక్కినట్టే. ఆ తరువాత ప్రతి సంవత్సరం పబ్లిక్ పరీక్షలను రాయాల్సి ఉంటుంది. ఏ ఉద్యోగానికి అయినా టెన్త్ ఉత్తీర్ణతే తొలి అర్హతగా పరిగణిస్తారు. అందుకే ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్ణయించుకుని ఈ పరీక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలి. ఉన్న సమయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి సబ్జెక్టును రివిజన్ చేసుకుంటే విజయం సునాయాసంగా అందుతుంది. అదే సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రభుత్వం పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తోంది.


గుడిపాల: పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

పదిలో రివిజన్ అవసరం

- ఏప్రిల్ 3వ తేదీ నుంచి టెన్త్ పరీక్షలు ఆరంభం
- ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలి
- అన్ని సబ్జెక్టుల రివిజన్‌పై దృష్టి
- ఉత్తమ ఫలితాలకు సర్కారు చర్యలు

గుడిపాల: చిత్తూరు నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రధానంగా గుడిపాల మండలం నరహరిపేట, కమ్మ తిమ్మాపల్లి, ఏఎల్ పురం పాఠశాలల్లో పని వేళలు ముగిశాక సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహి స్తున్నారు. విద్యా ర్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలో శిక్షణ ఇస్తున్నారు. ఉపాధ్యా యులే స్వయంగా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పరీక్షల ఆవశ్యకతను వివరిస్తున్నారు. ఇళ్లల్లో మొబైల్‌గేమ్స్, సోషల్ మీడియా పోస్టులు, కొత్త సినిమా కబుర్లు, క్రికెట్ మ్యాచ్‌లు వంటి జోలికెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని స్పష్టం చేస్తున్నారు. ఈ కొద్ది సమయాన్ని సంపూర్ణంగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని బోధిస్తున్నారు. ఇలాంటి కీలక సమయంలో అనవసర ఒత్తిళ్లకు గురై కాలాన్ని వృథా చేసుకోవద్దని విద్యార్థులకు సూచిస్తున్నారు. నెలల తరబడి నేర్చుకున్న పాఠాలను ప్రణాళికాబద్ధంగా రివిజన్ చేసుకోవాలని వివరిస్తున్నారు. మరోవైపు వెనకబడిన విద్యార్థులను గుర్తించి మరింత శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు .

నియోజకవర్గంలో 3257 మంది

పదవ తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 66 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో 23 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 1,346 మంది విద్యార్థులు, 43 ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో 1,911 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 3,257 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.

సమయాన్ని ఉపయోగించుకోవాలి

సమయాన్ని ఎంత తెలివిగా వాడుకుంటే అంత ఎక్కువ మార్కులు సాధించవచ్చు. సబ్జెక్టులు, అంశాల ప్రాధాన్యతను గుర్తించి ఉన్న కొద్దిపాటి సమయాన్ని విభజించి కేటాయింపు చేసుకోవాలి. పరీక్షలు దగ్గరపడే కొద్దీ చాలామంది గంటల తరబడి పుస్తకాల ముందు కూర్చుంటారు. అలా కాకుండా అప్పుడప్పుడు స్వల్ప విరామం తీసుకుంటే మెదడుపై ఒత్తిడి తగ్గుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

రివిజన్ మరవొద్దు!

విద్యార్థులు పరీక్షల సమయంలో తమకు రాని ప్రశ్నలపై ఎక్కువగా దృష్టి పెట్టి వచ్చిన వాటిని పట్టించుకోరు. ఎంతబాగా నేర్చుకున్న సమాధానాలైనా కొన్నిరోజులకు మరిచిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి విద్యార్థులు నేర్చుకున్న సమాధానాలను తరచూ రివిజన్ చేస్తుండాలి. పది సిలబస్ పూర్తి కావడంతో రివిజన్ ఎంతో ముఖ్యమని విద్యావేత్తలు చెబుతున్నారు.

రాత్రిళ్లు ఎక్కువగా మేల్కోవద్దు

కష్టపడి చదవాలని రాత్రిళ్లు ఎక్కువగా మేల్కొని ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దు. చక్కటి శాకాహారం, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని భుజించాలి. సినిమాలు, టీవీలు, ఇతరత్రా పండుగలు వాటన్నింటినీ కొన్ని రోజులు దూరంగా ఉంచాలి. ప్రణాళికా బద్ధంగా సమయాన్ని వినియోగించుకోవాలి. ఇతరులతో పోల్చుకొని నిరుత్సాహ పడకూడదు. విజయం సాధించబోతున్నానని భావించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. – సుధాకర్, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు



చేతిరాతకు పని పెట్టాలి

రివిజన్ చేయడంతో పాటు ఆ ప్రశ్న, జవాబులను రెండు, మూడుసార్లు రాయడం ద్వారా పూర్తిస్థాయిలో గుర్తుండిపోతుంది. పరీక్షలు రాసేటప్పుడు ప్రశ్నను బాగా చదివి అర్థం చేసుకొని సమాధానాలు రాయాలి. అంతేగాకుండా రివిజన్ చేసేటప్పుడు ప్రశ్న, జవాబులను బాగా అర్థం చేసుకుని చదవాలి. అర్థమైతే అంత త్వరగా మరిచిపోవడానికి వీలుండదు.

– నారాయణరెడ్డి, ఇంగ్లీషు ఉపాధ్యాయుడు



విద్యార్థులు పాటించాల్సినవి

- పాఠ్యాంశాలను తప్పనిసరిగా రివిజన్ చేసుకోవాలి.
- కొత్త అంశాల జోలికి వెళ్లకూడదు.
- టైం టేబుల్ ప్రకారం అన్ని సబ్జెక్టులపై దృష్టి పెట్టాలి
- కష్టమైన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించాలి.
- రివిజన్‌లో ముఖ్యమైన పాయింట్లు రాసుకోవాలి.
- పరీక్షల సమయంలో క్విక్ రివిజన్ ఎంతగానో ఉపయోగపడుతుంది.
- పాత ప్రశ్నపత్రాలు, మోడల్ ప్రశ్నపత్రాలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- ప్రశాంతంగా రోజుకు 6 నుంచి 7 గంటల పాటు నిద్రపోవాలి.
- పూర్తి పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఉండాలి.
- సెల్‌ఫోన్‌లకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.


పూతలపట్టు మండలంలో..

ఆరోగ్యంగా ఉండాలి

ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయగలరు. అందువల్ల ప్రిపరేషన్‌లో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ప్రోటీన్లతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి. తగిన నిద్రతోపాటు రోజూ క్రమం తప్పకుండా కొద్ది సమయం వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

శుభ్రతతో అంటువ్యాధులు దూరం



మురుగునీటి కాలువలను పరిశీలిస్తున్న వైద్యులు, రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ ప్రకాశం

యాదమరి: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు దరిచేరవని పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ గ్రామీణ ప్రజలకు సూచించారు. మండలంలోని దాసరాపల్లె దళితవాడలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. గ్రామంలోని మురికి కాలువలను పరిశీలించి, వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అపరిశుభ్రంగా ఉన్న మురికి కాలువల్లో పెనాయిల్ చల్లారు. నివాస గృహాల్లో నిల్వ ఉన్న నీటిని కింద పోసి పాత్రలను ఆరబెట్టారు. గ్రామీణ ప్రజలతో మాట్లాడుతూ వారంలో ప్రతి శుక్రవారం నిల్వ ఉన్న నీటిని కిందపోసి పాత్రలను ఆరబెట్టాలన్నారు. అప్పుడే లార్వాలు చనిపోయి దోమలు వృద్ధి చెందవని చెప్పారు. జ్వరాలు వ్యాపిస్తే వెంటనే చికిత్సలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల కట్టడికి చర్యలు చేపట్టాలి

చిత్తూరు రూరల్: దోమల కట్టడికి అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ ప్రకాశం ఆదేశించారు. నగరంలోని 23వ వార్డులో ఆయన వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న డ్రై డేను పరిశీలించారు. కొన్ని ఇళ్లను తనిఖీ చేశారు. నీటి నిల్వలపై సూచనలు చేశారు. దోమల వ్యాప్తి, కట్టడికి సంబంధించి చేపట్టాల్సిన విధివిధానాలను వివరించారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్‌లో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, సిబ్బంది జయరాముడు, పీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ ఏఎంవీఐపై దాడి సరికాదు


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న డీటీసీ కార్యాలయ అధికారులు, సిబ్బంది

చిత్తూరు రూరల్: కాకినాడ ఏఎంవీఐ చిన్నారావుపై వ్యక్తి దాడి చేయడం సరికాదని, అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డీటీసీ కార్యాలయ అధికారులు, సిబ్బంది డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని ఆ కార్యాలయం ఎదుట శుక్రవారం వారు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కాకినాడలో కొబ్బరి కాయలు అమ్మే వ్యక్తి శుక్రవారం ఉదయం ఏఎంవీఐ చిన్నారావుపై కత్తితో దాడి చేశారన్నారు. తీవ్రంగా గాయపడడంతోపాటు ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ మురళి, ఎంవీఐలు రాజేశ్వరరావు, వాసుదేవరెడ్డి, ఏఎంవీఐ శివకుమార్‌లు, సిబ్బంది విజయకుమార్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

20న చేపల చెరువుల వేలం

వెదురుకుప్పం: మండలంలోని గొడుగుచింత పంచాయతీలోని చేపల చెరువులను ఈనెల 20వ తేదీన వేలం వేయనున్నట్లు గ్రామ కార్యదర్శి మధు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి చెరువు, పుల్లగంగమండడి, పాపన్నగుంట, శ్రీరాముల గుంట చెరువు, తామరాకులగుంట చెరువులను వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆరోజు ఉదయం 11.30 గంటలకు గొడుగుచింత పంచాయతీ కార్యాలయంలో వేలం పాటలు ఉంటాయని అందులో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా రూ. 2 వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

తవణంపల్లె: గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని ఉప్పాంకలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అందులో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక రోగులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తర్వాత బీపీ, సుగర్ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భవతులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. గర్భవతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


గర్భిణులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డాక్టర్ ప్రియాంక

శాస్త్రోక్తంగా మహా కుంభాభిషేకం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఐరాల: మండల కేంద్రంలో శ్రీ పాలేటమ్మ ఆలయ మహా కుంభాభిషేకం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున 2 గంటలకు అర్చకులు పాలేటమ్మ నూతన రాతి విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేసి వేద మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. యాగశాలలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ హోమాలు, అంకుర్పారణ, వాస్తు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎం.కే.బాలాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.


చిత్తూరు నగరంలో రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా కరికోళం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం కరికోళం(నూతన రథం ప్రయోగత్మకంగా ఊరేగింపు)ను ఘనంగా నిర్వహించారు. ఆలయానికి గతకొన్నేళ్లుగా రథం లేదనే లోటు ఉండేది. ఈ లోటును భర్తీ చేసేందుకు కొందరు దాతలు ముందుకొచ్చారు. అలా దాతల సహకారంతో రూ.25 లక్షలు విరాళం సేకరించి ఆలయ బృందం తమిళనాడులోని తిరుచ్చిలో నూతన రథాన్ని తయారు చేయించింది. ఈ రథం గత ఆదివారం చిత్తూరుకు చేరుకుంది. ఈనెల 29వతేదీ నుంచి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు పారంభంకానున్నాయి. ఈనేపథ్యంలో నూతన రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రయోగత్మాకంగా మాడవీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే సతీమణి సత్యవతి, అర్చకులు, పాలకమండలి సభ్యులు పాల్గొనివిశేష పూజలు చేసి స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సకల వెంకటేష్ గుప్తా, సభ్యులు రాజా, హేమాద్రి, ఈఓ సుబ్రమణ్యంనాయుడు, ఆడిట్ రమేష్, అర్చకులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


పాలేటమ్మ అమ్మవారి విగ్రహం

వరిలో సస్యరక్షణతో అధిక దిగుబడి

బంగారుపాళెం: వరి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సిబ్బందితో కలసి రైతు భరోసా కేంద్రాలు, క్షేత్రస్థాయిలో పొలంబడి క్షేత్రాన్ని పరిశీలించారు. తొలుత మండలంలోని పాలేరులోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామ సభ కార్యక్రమంలో పాల్గొని రబీ సీజన్‌లో పంట నమోదు జాబితా ప్రదర్శన గురించి వివరించారు. రైతులకు పంటల సాగుపై సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. తిమ్మోజుపల్లె ఆర్‌బీకే పరిధిలోని బొమ్మాయిపల్లెలో నిర్వహిస్తున్న పొలంబడి క్షేత్రాన్ని సందర్శించారు. రైతులకు పొలంబడి ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. సేంద్రియ పద్ధతుల్లో వరి సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, జీవామృతం తయారీ విధానం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, ఆదాయం పొందడానికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. పంటల సాగు కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్‌బీకే చానల్‌ను రైతులు సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని సూచించారు. పంట సాగు విధానంలో అనుసరించే పలు విధానాలు తెలుసుకునేందుకు చానల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండలంలోని గుండ్లకట్టమంచి గ్రామంలో నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పద్మజ, ఏఈఓ సాదరయ్య, ఆర్‌బీకే సిబ్బంది పుష్పాంజలి, లావణ్య, మూర్తి, ఆనంద్‌రాజ్, రైతులు పాల్గొన్నారు.



బొమ్మాయిపల్లెలో జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, పెద్దమల్లెలలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ప్రకృతి వ్యవసాయం ఉత్తమం

రొంపిచెర్ల: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని ఐబీఎంపీ వేణి అన్నారు. మండలంలోని పెద్దమల్లెల, వారణాసివారిపల్లె గ్రామాల్లో రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో పంటల ఖర్చు తగ్గుతుందని తెలిపారు. అలాగే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. ఎండ కాలాన్ని దృష్టిలో పెట్టుకుని 32 రకాల చిరుధాన్యాలను సాగు చేయాలని సూచించారు. బీడు భూముల్లో బంతుల రూపంలో విత్తనాలను చల్లితే అవి 6 నెలల వరకు భూమిలో చెడిపోకుండా ఉంటాయని తెలిపారు. వర్షం పడితే మొలకలు వస్తాయన్నారు. వాన పాములు, సూక్ష్మ పురుగులకు నష్టం కలగదని చెప్పారు. సీఆర్‌పీలు రెడ్డెమ్మ, ఉష పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమల స్థాపనతో ఆర్థికాభివృద్ధి

గంగాధరనెల్లూరు: స్వయం సహాయక సంఘ సభ్యులు కుటీర పరిశ్రమల స్థాపనపై మొగ్గు చూపాలని డీఆర్‌డీఏ పీడీ తులసి కోరారు. మండలంలోని బొమ్మవారిపల్లెలో కాయర్ బోర్డు(మేట్ల) తయారీ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న శిక్షణను సంఘ సభ్యులు వినియోగించుకోవాలన్నారు. శిక్షణానంతరం కుటీర పరిశ్రమను ప్రారంభించి ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించుకుంటే లాభాలు పొందవచ్చన్నారు. తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. అనంతరం కలిజవేడు, పాపిరెడ్డిపల్లె సచివాలయాలను తనిఖీ చేశారు. ఏపీఎం చిరంజీవి, రూరల్‌యాక్షన్ సంస్థ సెక్రటరీ చిట్టిబాబు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ తులసి